పండుగ పూట... ధరల మంట

- ఏమీ కొనలేం... ఏమీ తినలేమంటున్న ప్రజలు
- పిండి వంటలకు దూరమైన పేద, మధ్యతరగతి వర్గాలు
- అమలుకు నోచుకోని కూటమి ప్రభుత్వ హామీలు
- ఉల్లిపాయలు కిలో రూ.50
- భయపెడుతున్న కూరగాయలు, నూనెల ధరలు


భీమడోలులో వెలవెలబోతున్న కూరగాయల దుకాణం


ఆకాశాన్నంటుతున్న దేశ వాళీ ఉల్లిపాయలు

భీమడోలు: పండుగ పూట నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి పేద, మధ్యతరగతి ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కూరగాయలు, వంట నూనెలు, పప్పుల ధరలు సామాన్యులకు అందనంతగా అమాంతంగా పెరిగాయి. కూటమి ప్రభుత్వ పాలనలో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రతి కుటుంబంపై రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అదనపు భారం పడుతుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఏడు నెలలుగా వాటి ధరలు దిగి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు కొనుగోలుదారులకు షాక్ కొడుతున్నాయి. జేబునిండా డబ్బులు వేసుకుని వెళ్లి కూరగాయాలు కొన్నా సంచి నిండని పరిస్థితి. పేద కుటుంబాలు అవసరమైనంతగా కూరగాయలు, నిత్యావసరాలు కొనలేక పోష్టికాహారానికి దూరమవుతున్న దుస్థితి నెలకొంది.

ధరల నియంత్రణకు ప్రభుత్వ చర్యలు శూన్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూరగాయల ధరలను అదుపు చేయడంతో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రజలు విమర్శిస్తున్నారు. జూన్ నెల ప్రారంభంలో ప్రారంభమైన ఉల్లి రేటు దిగి రావడం లేదు. రెండు కేజీల ఉల్లిపాయలు రూ.100 పలుకుతోంది. ప్రతి ఇంట్లో నిత్యావసరంగా ఉన్న ఉల్లి ధర కంటతడి పెట్టిస్తోంది. కూరగాయల ధరలు భారీగా పెరగడంతో ప్రతి రోజు లాభం కన్నా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని చిన్న వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పనుల్లేక ఇబ్బందులు పడుతున్న రోజువారీ కార్మికులకు ఈ ధరలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. వారానికి అవసరమైన కూరగాయలు కొనుగోలు చేసుకోవాలంటే రూ.600 నుంచి రూ.800 వెచ్చించాల్సిందే. కేజీ రూ.50 నుంచి రూ.120 వరకు పోటీ పడుతున్నాయి. స్థానికంగా పండించిన కూరగాయలు సైతం రేట్లు ఆకాశన్నంటాయి. కూరగాయల ధరల కన్నా చికెన్ ధరలే తక్కువగా ఉన్నాయని పలువురు అంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించే నిర్వాహకులు పెరిగిన నిత్యావసరాల ధరలతో వంట చేయాలంటేనే భయపడిపోతున్నారు.

సగటు జీవికి ధరా ఘాతం

ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 3.50 లక్షలకు పైగా జనాభా ఉండగా వారిలో 80 శాతం జనాభా పేద, మధ్యతరగతికి చెందిన వారే. వారి సగటు ఆదాయం నెలకు రూ.10వేల నుంచి రూ.15వేల లోపే. గతంలో నిత్యవసరాలు, కూరగాయాలు ప్రతి కుటుంబానికి రూ.10వేల వరకూ ఖర్చు అయ్యేది. ఇదే క్రమంలో నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో దీనితో వారికి వచ్చే ఆదాయ వనరులు లేకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

నిత్యావసరాలు- ధర (కిలో)

ఉల్లిపాయలు	రూ.50
నాటు చిక్కుళ్లు	రూ.120
ఆకాకర కాయ	రూ.120
చింతపండు	రూ.100
బీన్స్	రూ.100
దేశవాళీ ఉల్లిపాయలు	రూ.180/ రూ.300
తెల్ల వంకాయలు	రూ.60
పచ్చి బఠానీ	రూ.120

దిగిరాని పప్పులు, వంట నూనెల ధరలు

తెలుగు వారికి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని ప్రతి ఇంటా పిండి వంటలు వండేవారు. పిండి వంటలకు అవసరమైన నూనె ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు సైతం వాటికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నూనెల ధరలకు మరింత రెక్కలు వచ్చాయి. ప్రతి కిలోకు రూ.30 చొప్పున వంట నూనె ధరలు పెరగడంతో అన్ని వర్గాల ప్రజలు పండుగ వేళ పిండి వంటలు దూరమయ్యారు. వంట నూనె 15 లీటర్లు రూ.2,400 సామాన్యులు ఎక్కువగా వినియోగించే పామాయిల్ 15 లీటర్ల ధర రూ.2,250 పలుకుతోంది. గతంతో పోలిస్తే నూనెల ధరలు కేజీకు రూ.30 పైగా ధర పెరిగింది. వెల్లుల్లి ధర రూ.250 నుంచి రూ.500 వరకు పలుకుతోంది. కందిపప్పు ధర రూ.130 నుంచి రూ.160, ఎండుమిర్చి రూ.200, మినపప్పు రూ.110 పలుకుతోంది. పండుగ వేళ ప్రభుత్వాలు మండల కేంద్రాల్లో రేషన్ దుకాణాలు, రైతు బజార్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఉల్లిపాయలు, వంట నూనెలు గిట్టుబాటు ధరకు విక్రయించాలని ప్రజలు కోరుతున్నారు.



వివిధ రకాల వంట నూనె ప్యాకెట్లు

వ్యాపారం అంతంత మాత్రమే



మార్కెట్‌కు వచ్చే సరుకు తగ్గింది. రేట్లు కూడా పెరిగాయి. సామాన్యులు పెరిగిన ధరలకు భయపడి తక్కువగా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని సరిపెట్టుకుంటున్నారు. దేశవాళీ ఉల్లిపాయలను ఎక్కువగా బాలింతలు వినియోగించడం వల్ల కిలో రూ.180 నుంచి రూ.300 పలుకుతోంది.
– చిలుకూరి బుజ్జి, కూరగాయల వ్యాపారి, భీమడోలు

కూటమి ప్రభుత్వం వచ్చాకే ధరల పెరుగుదల



కూటమి ప్రభుత్వం వచ్చాక రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు పేదలు, మధ్య తరగతి ప్రజలను నడ్డి విరుస్తున్నాయి. ధరల తాకిడికి పండుగ నాడు పిండి వంటల తయారీకి ప్రజల దూరమయ్యారు. సరైన పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ధరలు తగ్గించి ప్రజలకు మేలు చేయాలి
– గంటా శ్రీనివాసరావు, ఎంపీటీసీ, ఎంఎంపురం

క్లుప్తంగా

చురుగ్గా నూతన రామాలయం నిర్మాణం


నిర్మాణం దశలో ఉన్న నూతన రామాలయం

దెందులూరు: గంగన్నగూడెంలో పాత రామాలయం స్థానంలో చేపట్టిన నూతన ఆలయ నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. గ్రామస్తుల ఆర్థిక సహాయ సహకారాలతో ఈ నిర్మాణం చేపట్టారు. పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో ఆలయ నిర్మాణం కొనసాగుతోంది ఆలయ కమిటీ సభ్యులు శనివారం వివరించారు.

గోపినాథపట్నంలో అన్నసమారాధన


గోపినాథపట్నంలో అన్నసమారాధనలో పాల్గొన్న కొట్టు సత్యనారాయణ

ఉంగుటూరు: గోపినాథపట్నంలో ముక్కోటి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు హాజరయ్యారు. తొలుత శ్రీరామపట్టాభిషేకం నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

అభయాంజనేయస్వామి ఈఓ బాధ్యతల స్వీకరణ

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారిగా పితాని తారకేశ్వర వీరవెంకటసత్యనారాయణ మూర్తి నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన ఈఓ కూచిపూడి శ్రీనివాస్ కొల్లేటి కోట పెద్దింట్లమ్మ దేవాలయం ఈఓగా బదిలీపై వెళ్లారు. దీంతో ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయంలో పనిచేసిన పితాని తారకేశ్వర వీరవెంకట సత్యనారాయణ మూర్తిని అప్పనవీడు ఈఓగా నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. దేవాలయ సిబ్బంది అర్చకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతించారు.

ఎస్సీ కులాల సర్వేలో అనేక దోషాలు

ఉంగుటూరు: కుల గణన సర్వేలో ఎస్సీ కేటగిరికి చెందిన హిందువులను క్రైస్తవులుగా నమోదు చేశారని, దీని వల్ల ఎస్సీ హిందువులు నష్టపోతారని ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గుడూరులో కుల గణన సర్వేలో ఎస్సీ హిందువుల్లో సుమారు 60శాతం మందిని క్రైస్తవులుగా చూపిస్తూ సచివాలయంలో డిజిటల్ బోర్డులో ప్రదర్శించారని, సర్వే ఎవరు చేశారో ఎవరికీ తెలియదన్నారు. సచివాలయంలో డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశామని, వివరాలు సరి చూసుకోవాలని అధికారులు చెబుతున్నారని ఎంపీపీ అన్నారు. సర్వే సమాచారం అందరికీ చేరలేదని, దీని వల్ల ఎస్సీలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ దీనిపై సమీక్షించి ఇంటింటికీ ఎస్సీ కులాల కుల సర్వే నిర్వహించాలని ఎంపీపీ డిమాండ్ చేశారు.

గుండుగొలనులో కాసినోను అడ్డుకోవాలి

భీమడోలు: గుండుగొలనులో కొనసాగుతున్న నిషేధిత కాసినో ఆటను అధికారులు అడ్డుకోవాలని, బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవికి ఫిర్యాదు చేసినట్లు మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ శనివారం తెలిపారు. విదేశీ సంస్కృతిని కొంతమంది వ్యక్తులు ధనార్జన కోసం గ్రామీణ ప్రాంతాలకు తీసుకుని వస్తున్నారని, వారి ఉచ్చులో పడి యువకులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. విచారణ చేసి బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో కాసినో తరహా ఆట జరగడం లేదని స్పష్టం చేసారు. గ్రామంలో ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్సై తెలిపారు.

రైతు భరోసా ఎప్పుడు ఇస్తారు?

దెందులూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అన్ని ప్రచార సభల్లో రైతులను ఆదుకుంటామని చెప్పి సంక్షేమ పథకాలన్నింటికీ కోత విధించిచి రైతులందరినీ దగా చేసిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, సానిగూడెం సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సానిగూడెంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండో పంట కూడా సాగు చేస్తున్న సమయానికి కూడా రైతులకు చంద్రబాబు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వలేదని అన్నారు. రైతు భరోసా అమలు చేయకపోయినా బీజేపీ, జనసేన నాయకులు మౌనంగా ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. చంద్రబాబు గతంలో మాదిరిగానే తన నైజాన్ని చాటుకుని రైతులను, ప్రజలను దగా చేశారన్నారు. రైతు భరోసాను అన్నదాతలకు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.

దాతల చేయూత అభినందనీయం


మహిళకు కుట్టుమిషన్ అందిస్తున్న ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

గణపవరం: పేదల జీవనోపాధికి మానవత సంస్థ, సభ్యులు అందిస్తున్న చేయూత అభినందనీయమని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. శనివారం గణపవరం మానవత కార్యాలయం వద్ద మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్లను పేద మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూత నివ్వడానికి మహిళలు స్వయం ఉపాధికి మానవత సంస్థ తరపున కుట్టు మిషన్లు, గ్రైండర్లు, మిక్సీలు వంటివి అందజేస్తూ వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు వంకాయల రామారావు, లయన్స్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కె.విశారద, ముత్యాల స్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


పిప్పర అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ పర్యవేక్షణలో రంగవల్లుల పోటీ నిర్వహించారు. భోగి మంట వేసి విద్యార్థులు సందడి చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

గణపవరం: మండలంలోని పలు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్ర ధారణలో చిన్నారులు సందడి చేశారు. పిప్పర అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సరిపల్లె విద్యాజ్యోతి విద్యాసంస్థలు, ఇండియన్ డిజిటల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగిమంటల చుట్టూ ఆటపాటలతో చిన్నారులు చేసిన డ్యాన్సులు, భోగిపండ్ల పేరంటాలు ఆకట్టుకున్నాయి.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

నిడమర్రు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రొవ్విడిలో శనివారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో 70 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మరాజు ఈ సంబరాల్లో పాల్గొని ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. తహసీల్దారు నాగరాజు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.


క్రొవ్విడి సంక్రాంతి సంబరాల సందర్భంగా రంగవల్లుల పోటీలో పాల్గొన్న మహిళలు



గణపవరం ప్రైవేటు స్కూల్లో సంప్రదాయ వేషధారణలో చిన్నారులు


నారాయణపురం ప్రభుత్వ కళాశాలలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు

రేషన్ డీలర్ నియామకానికి నోటిఫికేషన్

నిడమర్రు: మండల పరిధిలోని బావాయిపాలెంలో ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోని చౌకధరల దుకాణం- 15 ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేసేందుకు శాశ్వత ప్రాతిపదికన డీలరు నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసీల్దారు నాగరాజు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి బావాయిపాలెంకు చెందిన కేటగిరి బీసీ-డీ మహిళ అయి ఉండాలి. ఇంటర్ పాస్ అవ్వాలి. ఏదైనా ఉద్యోగం, ప్రభుత్వం నుంచి ఆదాయం పొందేవారు అనర్హులని తహసీల్దారు పేర్కొన్నారు. డీలరు ఎంపికకు ఏలూరు ఆర్డీవో కార్యాలయంలో ఫిబ్రవరి 9న రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నిడమర్రు తహసీల్దారు లేదా ఏలూరు ఆర్డీవో కార్యాలయానికి చేరే విధంగా వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కోడి పందేలకు రంగం సిద్ధం

ఉంగుటూరు: గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు కోడి పందేలు నిర్వహించవద్దుంటూ హెచ్చరిక చేస్తున్నా ఇవేమీ పందేల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఉంగుటూరు, నారాయణపురం, కైకరం, గొల్లగూడెం, వెల్లమిల్లి, రాచూరు, ఎ.గోకవరంలో కోడి పందేల బరులు సిద్ధమయ్యాయి. దూర ప్రాంతల నుంచి వచ్చే వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి


ఉత్తమ విద్యార్థిని సత్కరిస్తున్న వివేకానంద సేవా సంఘు సభ్యులు

గణపవరం: తనదైన మేధోసంపత్తితో భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శ ప్రాయుడని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ నిర్మలకుమారి, రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు అన్నారు. శనివారం వివేకానంద 106వ జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఉత్తమ విద్యార్థులను ప్రవాసాంధ్రుడు ఆర్ విజయరామరాజు ఆర్థిక సహకారంతో యువతకు ప్రోత్సాహం పేరుతో రుద్రరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి, నగదు ప్రోత్సాహకం అందజేశారు. తొలుత వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, త్యాగరాజ కళాక్షేత్రం అధ్యక్షుడు మాదేటి సురేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేకాట, కోడిపందేలపై నిషేధం అమలు

పెదపాడు: గ్రామంలో కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించవద్దని, జూదాలపై నిషేధం ఉందని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు. శనివారం పెదపాడు మండలంలోని వీరమ్మకుంటలో కోడిపందేలు, పేకాటపై నిషేధం అమలు చేస్తున్నామని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించామని అధికారులు తెలిపారు. సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నర్సింహ, స్థానికులు మాజీ జెడ్పీటీసీ కలిపిండి అప్పారావు, మరడాని రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణానికి అవస్థ

భీమడోలు: పండుగ వేళ బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గమ్యస్థానాలకు కుటుంబ సభ్యులందరితో చేరుకునేందుకు వారు నానా పాట్లు పడుతున్నారు.ఆర్టీసీ యాజమాన్యం పండుగకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్సుల సంఖ్య పెంచాల్సి ఉండగా ఉన్న ఆర్డినరీ బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడం వల్ల ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. ఇతర రూట్లలో భీమడోలు బస్టాండ్‌కు వచ్చే బస్సులు తగ్గాయి. ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నూజివీడు, నరసాపురం, రాజమండ్రి డిపోల నుంచి బస్సులు తగ్గాయి. దీనితో అరకొర బస్సులు వల్ల దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు నానాయాతన పడ్డారు. పిల్లలతో రోడ్లపై అవస్థలు పడుతున్నారు. సంక్రాంతి పండుగ సెలవులు వరసగా ఐదు రోజులు రావడం, వివిధ రాష్ట్రాల నుంచి తమ సొంత ఊళ్లకు వచ్చే వారి సంఖ్య పెరిగింది. దీనితో పాటు శనివారం కావడంతో ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల సంఖ్య పెరిగింది. వారి కోసం ఆర్టీసీ బస్సులు నడకపోవడంతో వారంతా బస్టాండ్ వల్ల పడిగాపులు కాసారు. భీమడోలు బస్టాండ్‌లో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు తమ గ్రామాలకు వెళ్లేందుకు సరైన సమయానికి బస్సులు రాకపోవడంతో వాటి కోసం ఎదురు చేస్తున్నారు. భీమడోలు బస్టాండ్‌కు వివిధ డిపోల నుంచి 50 సర్వీసుల ద్వారా ప్రతి రోజు రెండు వేల మంది ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో తమ గ్రామాలకు వెళ్తుంటారు. పండుగ వేళ ప్రతి నిత్యం వచ్చే వారి ప్రయాణికుల సంఖ్యకు నాలుగు రెట్లు పెరగడంతో అందుకు తగ్గట్లుగా బస్సులు లేక వారంతా ప్రైవేటు వాహనాలకు అధిక మొత్తాన్ని చెల్లించి వెళ్లాల్సి వస్తోంది. దీనితో జేబులకు చిల్లు పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉన్న బస్సులను లాగేజిలను చేత పట్టుకుని, కుటుంబ సభ్యులతో ఎక్కి తమ గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ పండుగ వేళ కూడా ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు సరైన బస్సులను సమకూర్చకపోవడంతో వారంతా అధికారులు, పాలకుల తీరును విమర్శిస్తున్నారు.


భీమడోలు బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చేస్తున్న ప్రయాణికులు


రద్దీగా ఉన్న బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఎంపీటీసీ పెద్దా అప్పన్న కుటుంబానికి పరామర్శ


ఎంపీటీసీ పెద్దా అప్పన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: కైకరం–2 ఎంపీటీసీ పెద్దా అప్పన్నను ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శనివారం పరామర్శించారు. అప్పన్న తండ్రి పెంటయ్య ఇటీవల మృతి చెందారు. అప్పన్న కుటుంబ సభ్యులను పుప్పాల వాసుబాబు ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వాసుబాబు వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ముఖ్యం

గణపవరం: అభివృద్ధి పనుల్లో నాణ్యత, జవాబుదారీతనం ముఖ్యమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరం మండలం పిప్పరలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన పలు సీసీ రోడ్లకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, సర్పంచ్ కాకర బేబీ, మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, మండల జనసేన అధ్యక్షుడు తోట శ్రీను, బీజేపీ మండల అధ్యక్షుడు కె.సుబ్బారావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

భీమడోలు: గుండుగొలను, భీమడోలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ , మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. స్థానికంగా నిర్మించిన గోకులం షెడ్డును వారు ప్రారంభించారు. భీమడోలు గ్రామ పంచాయతీలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో వాటిని ప్రారంభించారు. అనంతరం భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో వారు పాల్గొన్నారు. అదే పాఠశాలలో ఆంధ్రా ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. భీమడోలు శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం రిజిస్ట్రేషన్ చేయించాలని అభివృద్ధి ప్రతినిధులు ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందించారు. పెదలింగంపాడులో దళితులకు చెందిన శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ వినతిపత్రం అందించారు. సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఆంధ్రా ఆసుపత్రి డైరెక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, మినీ గోకులం ప్రారంభం

ఉంగుటూరు: సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతు పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం గోపినాథపట్నంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, మినీగోకులం (పశువుల శాల)ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో కలిసి ఆయన ప్రారంభించారు. గొల్లగూడెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.33 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు.